క్లుప్తంగా

బసవతారకనగర్‌లో గ్యాంగ్ వర్క్



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్ బసవతారకనగర్‌లో శుక్రవారం పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్ చేశారు. మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించాలని చెప్పారు. డ్రెయిన్లలో చెత్త వేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో వీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల వాణిజ్య విభాగం ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యాన విద్యార్థులకు నూతన కేంద్ర బడ్జెట్ 2023 పై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా మొవ్వ ప్రభుత్వ కళాశాల వాణిజ్య విభాగాధిపతి మురళి, కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, దీప్తి వ్యవహరించారు. కళాశాల వాణిజ్య విభాగాధిపతి కరుణ శ్రీ, కేఎస్‌జీ సుచరిత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి



జగనన్న ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న ఇళ్ల లే అవుట్లలో మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వెదురుపావులూరులోని జగనన్న ఇళ్ల లే అవుట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లే అవుట్‌లో విద్యుత్ శాఖతో చర్చించి త్రీఫేజ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. లే అవుట్లలో కనీస వసతులైన విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

దళిత బడ్జెట్ విశ్లేషణ నివేదిక పుస్తక ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీఎస్‌యూ (దళిత బహుజన శ్రామిక యూనియన్) ఆధ్వర్యాన శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో దళిత ఆదివాసి బడ్జెట్ విశ్లేషణ నివేదిక పుస్తకాన్ని సంఘ ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంగారు రాజు, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ కన్వీనర్ లలిత, కోలారాణి, ఏపీ రెల్లి కుల సంక్షేమ సంఘం ప్రతినిధి శీరంశెట్టి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేఎస్పీ సాంబశివరావు సూచించారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గెస్ట్ లెక్చర్ జరిగింది. ఆయన మాట్లాడుతూ బ్లింక్ యాప్ ద్వారా ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కడ నుంచైనా ఇంటర్నెట్ సహకారంతో ఆపరేట్ చేసుకోవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి శైలజ, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో నగర అధ్యాపకులు



పెర్లి దాసుకు ప్రశంసా పత్రం అందిస్తున్న సంపత్ కుమార్, సిమ్మన్న, సాంబశివరావు

విజయవాడ కల్చరల్: ప్రాచీన విశిష్ట భాషా కేంద్రం, నెల్లూరు భారతీయ భాషా సంస్థ, మైసూర్ విద్యాకేంద్రం, ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం రాజమండ్రి వారు మూడు రోజులపాటు రాజమండ్రిలో నిర్వహించిన భాషా సదస్సులో నగరానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు పరిశోధకుడు గుమ్మా సాంబశివరావు సభకు అధ్యక్షత వహించినట్లు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య వెలిమల సిమ్మన్న, పలువురు ఆచార్యులు పాల్గొన్నారని తెలిపారు.

వెండితెర ఆభరణం

- కాశీనాథుని విశ్వనాథ్
- నగరంతో అనుబంధం

విజయవాడ కల్చరల్: తెలుగు సినిమాకు గౌరవాన్ని , గుర్తింపును తెచ్చిన మహాదర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్. ఆయన అనేక ప్రశస్తమైన సినిమాల సృష్టికర్త. తెలుగు సినిమా కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పి అనేక కళాత్మక దృశ్యకావ్యాలను అందించిన వెండితెర ఆభరణం విశ్వనాథుడు. వెండితెరపై సాగరసంగమం, శంకరాభరణాన్ని సృజించిన కళాతపస్వి. ఆయనకు నగరంతో జిల్లాలోని అనేక ప్రాంతాలతో అనుబంధముంది. విశ్వనాథుడు నగరంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో ఆయనకు మిత్రులు, సన్నిహితులకు కొదువలేదు. విశ్వనాథ్ సోదరి విశాలాక్షి లబ్బీపేటలో ఉండేవారు. నగరానికి వచ్చినప్పుడల్లా ఆమె ఇంటికి వెళ్లేవారు. 1994లో ఆంధ్రనాటక కళాపరిషత్ స్వర్ణోత్సవ సంబరాల్లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరిసారిగా దాదాసాహెబ్ పురస్కారం అందుకున్నసందర్భంగా లైఫ్‌టైమ్ అవార్డు అందుకోవడానికి 2018లో నగరానికి వచ్చారు.



విశ్వనాథ్ సంతాప సభలో చిత్రకారుడు ఎస్వీ రామారావు,గోళ్ళ నారాయణరావు, చిట్టిబాబు తదితరులు

కళాదర్శని ఉత్సవాల్లో విశ్వనాథ్

లయోలా కళాశాల అనుబంధ సంస్థ కళాదర్శని ఏటా వార్షిక సాంస్కృతిక ఉత్సవాలు, పోటీలు జరుగుతాయి. 2005లో జరిగిన ఉత్సవాలకు కళాతపస్వి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి 76వ జయంతి సందర్భంగా నిర్వాహకురాలు పరచూరి విజయలక్ష్మి ఆధ్వర్యాన 2012లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మహానటి సావిత్రి పురస్కారంతోసత్కరించారు. రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ 2018లో విశ్వనాథ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించింది. నగరానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావుతో విడదీయలేని బంధం ఉండేదని ఆయన దర్శకత్వం వహించిన జీవనజ్యోతి, సప్తపది , కాలంమారింది చిత్ర కథా చర్చలు తుర్లపాటి ఇంట్లోనే జరిగాయని తుర్లపాటి కుమారుడు జవహర్‌లాల్ వివరించారు.

మా కుటుంబ సభ్యుడు

శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. కుటుంబ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే వారని హైదరాబాద్ వెళ్లిన ప్రతి సందర్భంలోనూ ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందని తెలిపారు.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సన్మాన సభలో కె.విశ్వనాథ్(ఫైల్)

విశ్వనాథ్‌కు నివాళి

విజయవాడ కల్చరల్: సంచలన చిత్ర దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ అని అంతర్జాతీయ తెలుగు చిత్రకారుడు ఎస్వీ రామారావు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో దర్శకుడు విశ్వనాథ్ సంతాప సభను కౌతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు, వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, చలపతిరావు పాల్గొన్నారు.

- నగరానికి చెందిన కళాసంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, సీహెచ్‌వీ సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, నిడుమోలు రమాసత్యనారాయణ, విద్యావేత్త ఎంసీదాస్ సంతాపం వ్యక్తం చేశారు.

పారుపల్లి ప్రేరణ

నగరానికి చెందిన సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వేషధారణకు ఆకర్షితుడై ఆయన స్ఫూర్తితో శంకరాభరణం సినిమాలో శంకరశాస్త్రి పాత్రను మలచారని సంగీత ప్రయోక్త మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఆ సినిమా విజయవంతం కావడంతో నగరంలోని అప్సర టాకీస్ నుంచి నేరుగా గాంధీనగర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహాన్ని దర్శించుకున్నారని తెలిపారు. 2017లో భాషా సాంస్కృతిక శాఖ, అభిరుచి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన జరిగిన విశ్వనాథ్ అభినందన సభకు వ్యాఖ్యానం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు వ్యాఖ్యాతలు పూర్ణ తంగిరాల, బి.జయప్రకాష్ తెలిపారు.

రూమ్ నెం : 421

కళాతపస్వి జిల్లాకు వచ్చినప్పుడు గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో రూమ్ నెం 421లో దిగటం ఆయన సెంటిమెంట్‌గా భావించేవారు. అక్కడే బసచేసేవారని హోటల్ నిర్వాహకుడు ఐలాపురం రాజా తెలిపారు.

దత్తాత్రేయుడి పునఃప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీదత్తాత్రేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పూజలు చేశారు. ప్రతిష్టా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, చతుర్వేద పారాయణం వేదపండితుల మంత్రోచ్చరణలతో జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

వేధిస్తున్న యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన జయలలిత(22) కాలనీలో ఉంటున్న బాబాయి, పిన్నితో నివసిస్తోంది. కాలనీలోని బ్లాక్ నెం 10లో నివసించే సూరాబత్తుల దేవిశ్రీప్రసాద్, జయలలిత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల దేవిశ్రీప్రసాద్ వయస్సు జయలలిత కంటే తక్కువగా ఉండటం, ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మాట్లాడుకోవడం లేదు. దేవిశ్రీప్రసాద్ మూడు రోజుల క్రితం జయలలిత ఇంటికి వెళ్లి అసభ్యకరంగా మాట్లాడటమే కాకుండా ఇబ్బందులకు గురిచేశాడు. పెళ్లి ఇష్టం లేదని కాగితంపై రాసి ఇవ్వాలని వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏపీని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం 23వ డివిజన్ 98వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కో ఆర్డినేటర్ ఒగ్గు విక్కీతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇంటింటికీ వెళ్లారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, యామల వారి వీధి, ఆకుల వారి వీధి, పాలపర్తి వారి వీధి, మద్దులపల్లి వారి వీధి, గోపాలరెడ్డి రోడ్డు, పెద్దిబొట్ల వారి వీధి, బీసెంట్ రోడ్డు, గూడవల్లి వారి వీధి, రాజగోపాలచారి వీధుల్లో ఇంటింటికీ పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును బుక్‌లెట్ల ద్వారా అంకెలతో సహా లబ్ధిదారులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, వలంటీర్ వ్యవస్థ అందించిన సేవలను మరువలేమని ప్రజలు తనతో చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం డివిజన్‌లో పెద్దఎత్తున సమస్యలను వదిలివెళ్లిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రిని కించపరుస్తూ చంద్రబాబు, నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని.. కానీ భాషలో విచక్షణ లేకుండా మాట్లాడటం తగదని హితవు పలికారు.



స్థానికురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కళాతపస్వి మరణం కలచివేసింది

తెలుగు సినిమా స్థాయిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన కళాతపస్వి కె.విశ్వనాథ్ గారి మరణం తనను కలచివేసిందని మల్లాది విష్ణు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డీఈ రామకృష్ణ, ఏఎంఒహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

నేటి మహిళలకు మాల్వియా యాత్ర స్ఫూర్తిదాయకం

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా సాధికారత సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న ఆశా మాల్వియా నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ అన్నారు. మధ్యప్రదేశ్ నుంచి ఢిల్లీ వరకు సంపూర్ణ భారత యాత్ర చేస్తున్న సైక్లిస్ట్ ఆశా మాల్వియా శుక్రవారం జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌ను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాల్వియాను అభినందించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆశా మాల్వియా 'సంపూర్ణ భారత్ యాత్ర' నవంబర్ 1న మధ్యప్రదేశ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఫ్లాగ్ ఆఫ్ చేశారన్నారు. ఆమె తన యాత్రలో భాగంగా ఎనిమిది రాష్ట్రాల్లో 8, 545 కిలోమీటర్లు ప్రయాణించారన్నారు. మాల్వియా మాట్లాడుతూ దేశంలో మహిళలకు పూర్తి భద్రత ఉండాలని, మహిళా భద్రత, సాధికారతపై దేశమంతటా సైక్లింగ్ చేస్తున్నానన్నారు. ఇప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఏపీ రాష్ట్రాలను కవర్ చేస్తూ సైకిల్ యాత్ర చేశానన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి హేమచంద్ర, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి యు. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రికురాలు మాల్వియాతో జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్‌కుమార్

విజయబాబుకు సత్కారం



అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబును సత్కరిస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ పూర్వ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థి రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబును శుక్రవారం ఆ కాలేజీ పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ తనకు కళాశాల జీవితాన్ని నేర్పిందన్నారు. నాటి అధ్యాపకుల సహకారంతోనే నేడు ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఆక్రమణకు గురైన ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల భూమిని ఇప్పించడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు డాక్టర్ రామచంద్రారెడ్డి విజయబాబు సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు జానయ్య, కార్యదర్శి షేక్ మహబూబ్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

నాలుగోరోజుకు నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తును లోకానికి అందించిన మరియతల్లిని లోకమాతగా కీర్తిస్తున్నారని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు నాలుగోరోజుకు చేరుకున్నాయి. శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో బిషప్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మరియతల్లి పవిత్ర జీవితాన్ని గుర్తించి ప్రేమ మార్గంలో నడుచుకోవాలని పేర్కొన్నారు. మానవాళిని సంరక్ష/ ంచేందుకు మరియతల్లి దేవునిని వేడుకుంటోందని వివరించారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికత, భక్తి భావనలు ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పుణ్యక్షేత్ర గురువులతో కలసి సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు, అంతకు ముందు గురువులు, మఠకన్యలతో పాటు పలు విచారణల విశ్వాసులు పెద్ద సంఖ్యలో మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మరియ తల్లిని వేడుకున్నారు.



దివ్య సత్ప్రసాద ఆరాధనలో గురువులు

శరీరంపై మచ్చలను అశ్రద్ధ చేయొద్దు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): శరీరంపై మచ్చలు కనిపిస్తే సమీపంలోని కార్పొరేషన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆరో డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు వియ్యపు అమర్‌నాథ్ చెప్పారు. కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ కొండపై ప్రాంతంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన, మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు అయేషా, ఏఎన్ఎం ఝాన్సీ పలు సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లతో పాటు స్థానిక మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు పలు సూచనలు చేశారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఈ ప్రాంతాలను సందర్శించారు. ఎక్సెల్‌ప్లాంట్ ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డ్ రూము, రోడ్ల పనులను పూర్తి చేయాలని, ప్రవేశ ద్వారం నుంచి వేబ్రిడ్జి వరకు ఉన్న మార్గాన్ని బీటీ రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన ఐకానిక్ పార్కు పనులను పరిశీలించారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనుల పరిశీలన

వీఎంసీ కమిషనర్ అధికారులతో కలసి జాతీయ రహదారి వెంట జరుగుతున్న ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, పనుల వివరాలను రిపోర్ట్ చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రామవరప్పాడు రింగు నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేరకు జరగాల్సిన పనులను 15 రోజుల లోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఈఈలు ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, నారాయణమూర్తి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐకానిక్ పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్‌లో ఇంటర్నేషనల్ ఎలియన్స్ క్లబ్ 225ఎస్ ఎన్టీఆర్ జిల్లా గవర్నర్ కందుల శారదావాణి ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన సదస్సు, రక్తదాన శిబిరం జరిగింది. తొలుత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. సదస్సుల్లో అమెరికన్ అంకాలజీ వైద్యులు అనిల, రైల్వే డాక్టర్ సుమలత, ఆంధ్రా హాస్పటల్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన లేకే చివరి దశ వచ్చేవరకు తెలియడం లేదన్నారు. అనంతరం వైద్యులతోపాటు రైల్వే వాగ్యన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రవీంద్రనాథ్, ప్రొడక్షన్ ఇంజినీర్ కె.సంపత్‌కుమార్, రైల్వే స్పెషల్ ఆఫీసర్ శిఖినం శ్రీనివాసరావు మొక్కలు నాటించి నార సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ వెంకటేష్, ఎస్ఎన్‌జీ అలియన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మణిమాల, సెక్రటరీ సతీష్, కేవీడీ ప్రసాద్, వర్క్‌షాప్ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాట



నాడు... గతంలో ఆర్‌యూబీ మార్గంలో ప్రయాణికులు ఎదుర్కొన్న ఇబ్బందులు



నేడు.... తారురోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత ఆర్‌యూబీ మార్గం ఇలా..

సింగ్‌నగర్‌లోని ఆర్‌యూబీ రోడ్డును నిర్మించారు. గతంలో విష్ణు హయాంలో ఆర్‌యూబీ మార్గాన్ని నిర్మించడానికి అనుమతులు తీసుకొచ్చి శ్రీకారం చుట్టారు. ఇది పూర్తయిన తర్వాత టీడీపీ హయాంలో దీన్ని పట్టించుకోపోవడంతో గోతులు పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనికి మరమ్మతులు చేశారు. అయితే ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మించారు.

– అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

సాక్షి ప్రీమియర్ లీగ్ ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి సీనియర్స్, జూనియర్స్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జూనియర్స్ విభాగంలో ఎన్నారై జట్టు, సీనియర్స్ విభాగంలో నలంద జట్టు ట్రోఫీ గెలుపొందాయి. విజేతలకు, రన్నర్స్‌కు ఎన్టీ ఆర్ జిల్లా కమిషనర్ టీకే రాణా బహుమతులు అందజేశారు. అతిథులు క్రీడాకారులను అభినందించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సీనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన లయోల జట్టు



జూనియర్స్ విభాగంలో రన్నర్స్ గా నిలిచిన గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ జట్టు